క్లుప్తంగా

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: త్వరలో ప్రవేశపెట్టనున్న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు హాతిరామ్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పాలకులు ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగినంతంగా నిధులు కేటాయించటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాధ్యులు హరీష్, ధర్మరాజు, రవీంద్రచారి, చేతన్‌రెడ్డి, లవన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, బాధ్యులు బుధవారం సన్మానించారు. రిజిస్ట్రార్‌గా మరో సంవత్సరంపాటు కొనసాగనున్న నేపథ్యంలో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు రాము, చందు, శ్రీనివాస్, కుర్సా అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కాజీపేట: మాఘ మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో చిన్నారులు బుధవారం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు సాయికృష్ణ శర్మ ప్రారంభించారు. సినీ నృత్య దర్శకురాలు సీతారత్నం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. 'నిత్యం ఆలయాల సందర్శన, భక్తి భావం' అనే అంశంపై ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



హన్మకొండ: హనుమకొండ వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు పంపిణీ చేశారు.

చైల్డ్‌లైన్ సేవలపై అవగాహన



కాజీపేట / కాజీపేట రూరల్: బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు బాల కార్మికుల వ్యవస్థను రూపుమాపడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని చైల్డ్‌లైన్ జిల్లా టీం సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ కోరారు. బాలలు ఆపదలో ఉన్నప్పుడు 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఆటో డ్రైవర్లు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు అనే అంశాలపై కాజీపేట 62వ డివిజన్ సోమిడి ఆటో అడ్డాలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

అచ్యుతాష్టకం విష్ణుసహస్ర నామస్తోత్ర కంఠస్థ పోటీలు



హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని అచ్యుతాష్టకం, విష్ణుసహస్ర నామ స్తోత్ర కంఠస్థ పోటీలు నిర్వహించారు. గోపాల్‌పూర్ రోడ్డులోని శశికళ హైస్కూల్‌లో బుధవారం జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు శశికళ హైస్కూల్ హెడ్‌మాస్టర్ టి.దయాకర్ బహుమతులు అందజేశారు. పోటీలను టీటీడీ డీపీపీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

ఆర్పీఐ (అంబేడ్కర్) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డివల్ల వీరస్వామి



హన్మకొండ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ - అంబేడ్కర్) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డివల్ల వీరస్వామి ఎన్నికయ్యారు. ఈమేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



రామన్నపేట: ఎల్‌ఓసీ అందజేస్తున్న చీఫ్ విప్



హసన్‌పర్తి: ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

రామన్నపేట: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధుల చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య చికిత్స ఆర్థికసాయం చేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన కేశరాజు అశ్విని అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య చికిత్స ఖర్చులకు నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీని ఆయన అందజేశారు. ఈమేరకు రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, మాజీ కార్పొరేటర్, కుడా డైరెక్టర్ శివశంకర్, ఇజ్జగిరి భీంరాజ్, ముత్యాల మహేందర్, మంద చంటి, గొర్రె రంజిత్ కుమార్, కేశరాజు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

కాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి మెరుగైన వైద్య అందేలా రూ.లక్ష ఎల్‌ఓసీ చెక్కును చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం అందజేశారు. కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన గిన్నారపు చింటు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

హసన్‌పర్తి: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. రెండవ డివిజన్ వంగపహాడ్‌కు చెందిన ముస్కు ప్రశాంత్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.లక్ష విలువగల ఎల్‌ఓసీని హనుమకొండలోని ప్రశాంత్‌నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్‌గౌత్, యూత్ నాయకులు బొమ్మగాని వెంకటేష్, ముస్కు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీమాబాద్: రాష్ట్రంలో పలు నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పసునూరి రాజు విమర్శించారు. ఈమేరకు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా పరిపాలన అధికారి శ్రీకాంత్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాశ్వత అంగవైకల్యం కలిగిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.6 వేల చొప్పున పెన్షన్, అలాగే, ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, మైదం పాణి, మోహన్, విద్యాసాగర్, గాడిపల్లి మోహన్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



హసన్‌పర్తి: పేర్లు నమోదు చేసుకుంటున్న సిబ్బంది



కాశిబుగ్గ: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

హసన్‌పర్తి: ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ అన్నారు. హసన్‌పర్తి మండలం అర్వపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించిన తర్వాత అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్స చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జెన్నయ్య, మాజీ ఉపసర్పంచ్ చిరంజీవి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బిలాల్, పంచాయతీ సెక్రటరీ రాజ్‌కుమార్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో..

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ వీకర్ సెక్షన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాశిబుగ్గ కంటి వెలుగు కేంద్రం వైద్యులు గుండా రవిందర్ సూచించారు. కాశిబుగ్గ కంటివెలుగు కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని 14, 19, 20వ డివిజన్లకు చెందిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాశిబుగ్గ యూపీహెచ్‌సీ వైద్యులు కిరణ్, ఆప్తామాలజిస్ట్ సౌమ్య, సీహెచ్ఓ మోహన్, డీఈఓ మానస, ఏఎన్ఎంలు జ్యోతి, శ్రీలత, ఆశ వర్కర్లు కోమల, రజిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్డు ప్లాట్‌ఫాం ఎత్తు తగ్గించాలి



డీఆర్ఎంకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు ప్లాట్‌ఫాం ఎత్తు తగ్గించి రైల్వే ట్రాక్ లెవల్ నిర్మాణం చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే షావుకార్ హమాల్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కక్కె సారయ్య కోరారు. ఈమేరకు గూడ్సు షెడ్డు అభివృద్ధి పనుల తనిఖీకి వచ్చిన దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ అభయ్‌కుమార్ గుప్తాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సారయ్య మాట్లాడుతూ గూడ్స్ షెడ్డు ప్లాట్‌ఫాం ఎత్తుగా ఉండటంతో వ్యాగన్ల నుంచి లోడింగ్ చేసే క్రమంలో లారీలకు ప్లాట్‌ఫాం మధ్య చెక్కలు పెట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. దాంతో అన్‌లోడింగ్ ఆలస్యం అవుతోందని, హమాలీలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. గూడ్సు షెడ్డులో ఉన్న షెడ్లను తొలగించి మరోచోట నిర్మించాలని సూచించారు. అలాగే, తమ సమస్యలు పరిష్కరించాలని ఆటో డ్రైవర్లు డీఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నారాయణ, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పిచికారీ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా పంట పొలాల్లో నానో ద్రవ యూరియా (పురుగుల మందు) పిచికారీ చేశారు. అనంతరం ఇఫ్కో కంపెనీ జిల్లా మేనేజర్ విశాల్‌షిండే మాట్లాడుతూ నానో యూరియాతో పంటలో దిగుబడి వస్తుందని అన్నారు. అలాగే, ఎలాంటి కాలుష్యమూ ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, సీఈఓ రాజిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కాజీపేట అర్బన్: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ తరగతులను కార్పొరేటర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులకు 30 రోజులపాటు కరాటే శిక్షణను రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. కరాటే శిక్షణ తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు సీహెచ్.రవీందర్‌రాజు, చంద్రమోహన్, సౌందర్య, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, కరాటే మాస్టర్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై పట్టింపేది?



మాట్లాడుతున్న శంకర్ నాయక్

కాజీపేట: గిరిజనులు అటవీ ప్రాంతాల్లో దుర్భరమైన జీవితాలు గడుపుతున్నా పాలకులు ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని సీపీఐ అనుబంధ సంఘమైన గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ విమర్శించారు. కాజీపేట 63వ డివిజన్ ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీలో గిరిజన సమాఖ్య సమితి విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాజీపేట మండల కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా భూక్య స్వరూపలతో పాటు 15మంది సభ్యులను ఎన్నుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన మామునూరు ఏసీపీ కృపాకర్



మామునూరు: మామునూరు సబ్ డివిజన్ ఏసీపీగా కృపాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కృపాకర్‌ను మామునూరు, పర్వతగిరి, గీసుగొండ, గ్రెయిన్ మార్కెట్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీని కలిసి ఏసీపీ

వరంగల్ క్రైం: మామునూరు ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కృపాకర్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందించారు.

విద్యార్థులకు యునిసెఫ్ ప్రశంసలు



యునిసెఫ్ ప్రతినిధితో విద్యార్థులు

హసన్‌పర్తి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎగ్జిబిట్‌ను యునిసెఫ్ బృందం ప్రశంసించింది. హైదరాబాద్ గచ్చిబౌళిలోని టీ -హబ్ 2.0లో సోమవారం జరిగిన ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు సీహెచ్.లక్ష్మీప్రసాద్, జి.విష్ణువర్ధన్ 'టైం సేవింగ్ షాపింగ్ కార్ట్' అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిట్‌ను యూనిసెఫ్ గ్లోబల్ ప్రతినిధి హార్వ్ మారిన్, చీఫ్ ఆఫ్ యువాహ్ కంపెనీ ప్రతినిధి ద్వారక శ్రీరాం, తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ఆఫీసర్ శాంత, యూనిసెఫ్ తెలగాణ చీఫ్ అభిషేక్ గుప్త, సీఈఓ యువాహ్ పరిశీలించి ప్రశంసించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎగ్జిబిట్ ప్రదర్శించిన విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ శ్రీనివాస్‌ను హెచ్ పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉర్సు బండ్‌ను అభివృద్ధి చేస్తాం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నరేందర్

కరీమాబాద్: ఉర్సు గుట్ట బండ్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. స్మార్ట్‌సిటీ, ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ, ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులతో కలిసి ఉర్సుగుట్ట ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వాకర్స్‌కు కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉర్సు బండ్ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, పల్లం రవి పాల్గొన్నారు.

నేనూ సర్కారు బడి విద్యార్థినే..



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుకొండ: తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, అప్పట్లో కంటే ప్రస్తుతం బడులు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ - మన బడి మొదటి విడతలో రూ.22.25 లక్షలతో చేపట్టిన పనులు పూర్తి కాగా ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ విజన్‌తో సర్కారు బడులు ఆధునిక హంగులు దిద్దుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కోట శ్రీవత్స, డీఈఓ వాసంతి, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ సుధీర్‌బాబు, మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, డీడబ్ల్యూఓ శారద, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. కాగా, కార్యక్రమం ఆలస్యం అవుతుండటంతో మొగిలిచర్ల పాఠశాల వద్ద వరకు వచ్చిన మేయర్ గుండు సుధారాణి.. వెనుదిరిగినట్లు తెలిసింది.

సంక్షిప్తంగా

15 నుంచి సీపీఐ(ఎంఎల్) జాతీయ మహాసభలు

హసన్‌పర్తి: ఈనెల 15నుంచి 20వ తేదీవరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈమేరకు మహాసభల వాల్‌పోస్టర్‌ను హసన్‌పర్తి మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా మాట్లాడుతూ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అనేకమంది ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. పార్టీ పోరాటాలు, రాజకీయ పరిస్థితులపై మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుమార్, నాయకులు నాగేశ్వర్‌రావు, సాంబయ్య, కల్యాణ్, రాజు, అమూల్య, స్రవంతి, స్వర్ణలత, స్వరూప, పోశయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సద్గురు సచ్చిదానంద స్వామికి ఆహ్వానం

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల దేవాలయాన్ని సందర్శించాలని దత్తపీఠం సద్గురు గణపతి సచ్చిదానంద స్వామిజీని ఆలయ అర్చకులు ఆహ్వానించారు. ఈమేరకు మైసూర్‌లో సచ్చిదానంద స్వామిని ఆలయ ప్రధాన అర్చకుడు వరియోగుల శ్రీనివాసస్వామి, గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకుడు లక్ష్మణ స్వామి, అభివృద్ధి కమిటీ సభ్యుడు చెమ్మల సాగర్ బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు.

మహాగణపతి కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం

వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ 3వ గేట్ ఎదురుగా రెడ్డిపాలెంలో మహాగణపతి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను బుధవారం ప్రారంభించారు. స్టోరేజీను అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రాంప్రసాద్ తెలిపారు. లక్షా ముప్పై వేల బస్తాల కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజీను రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏనుమాముల మార్కెట్ చైర్మన్ దిడ్డి భాగ్యలక్ష్మి, కంపెనీ డైరెక్టర్లు శ్రీదేవి, రాణాప్రసాద్, డాక్టర్ రాహుల్ ప్రసాద్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ కంది రవీందర్‌రెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి, కంభంపాటి కుమారస్వామి, వరంగల్ పద్మశాలి వాణిజ్య పరపతి సంఘం అధ్యక్షుడు కూచన సమ్మయ్య, కార్యదర్శి సాదుల దామోదర్, అట్ల వైకుంఠం, స్థానిక వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటలోని కొత్తగడ్డపై రూ.50లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్మికుల కమ్యూనిటీ హాల్‌కు మాజీ కార్పొరేటర్ బిల్లా కవిత, స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బీఆర్ఎస్ నేత బోగి సురేష్‌తో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం 100 గజాల స్థలం కొనుగోలు కోసం రూ.5లక్షలు వ్యక్తిగతంగా ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్, బిల్లా రవి, చందర్, రాంబాబు, సంగరబోయిన ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కరీమాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాలు అందజేసిన వల్లపు సూర్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీకి రవి రాజీనామా

హసన్‌పర్తి: మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎమ్మెస్పీ) వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట రవిమాదిగ ఎమ్మెస్పీకి రాజీనామా చేశారు. ఈమేరకు తన రాజీనామా పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా ఎమ్మెస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు బుధవారం పంపించారు. వ్యక్తిగత కారణాలతో రాజీమానా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

హన్మకొండ: హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను 59 డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గుజ్జుల మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గైని సత్యనారాయణ, అర్చకుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ క్యాలెండర్‌ను హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్, భవన నిర్మాణ కార్మికుల సంఘం హసన్‌పర్తి ప్రతినిధులు అనిల్, కనకస్వామి, సాంబశివరావు, లక్ష్మీనారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేసీఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

హసన్‌పర్తి: అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయిలో కేసీఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈపోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.50 వేల నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సూపర్ 8లో అర్హత సాధించిన జట్లుకు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతి అందించనున్నట్లు వివరించారు. తొలుత పోటీలు మండలాల వారీగా పోటీలు నిర్వహించనున్నారు. అందుకోసం మైదానాలు సిద్ధం చేశారు.

ఉద్యోగుల వేతనాల పెంపునకు వీసీ హామీ



వీసీకి బొకే అందిస్తున్న సీఐటీయూ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న లంప్సమ్, కాంట్రాక్టు, దినసరి వేతన ఉద్యోగుల కార్మికుల వేతనాలను త్వరలో పెంచనున్నట్లు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ హామీ ఇచ్చారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బుధవారం కలిసి విన్నవించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, బాధ్యులు చిరంజీవి, రామచందర్, దేశిని రవికుమార్, రాజేందర్, రాజు, మధు, రాజు, పల్లం రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్

కాజీపేట రూరల్: అభివృద్ధి పథంలో తెలంగాణ దూసుకుపోతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 64వ డివిజన్ మడికొండ హిల్స్ కాలనీ, వాల్మీకి కాలనీల్లో రూ.64.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ దువ్వ శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్, డివిజన్ మాజీ ప్రెసిడెంట్ పోలెపల్లి రాంమూర్తి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు లింగమూర్తి, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

'ఏనుమాముల'లో సంబరాలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి పదవీకాలం పొడిగింపు నేపథ్యంలో మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో దిడ్డి కుమారస్వామి అభిమానులు, వ్యాపారులు, గుమాస్తాలు, మార్కెట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు కుట్టు మిషన్ అందజేత



కుట్టు మిషన్ అందిస్తున్న సంఘం నేతలు

రామన్నపేట: ఆర్థికలేమితో కొట్టుమిట్టాడుతున్న శాయంపేట నివాసి పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన పిట్టా శ్రీదేవికి ఐవీఎఫ్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువ గల కుట్టుమిషన్‌ను బుధవారం అందించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, పద్మశాలి సంఘం నాయకులు ఆడెపు రవీందర్, లీలావతి, సత్యనారాయణ, వడ్నాల నరేందర్, బాలిని నాగరాజు, ప్రేమ్‌సాగర్, అమర్‌నాథ్, భద్రకాళి దేవస్థానం మాజీ ధర్మకర్త తోనుపునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)